
సాక్షి
మహబూబ్‌నగర్
గురువారం । 22 । ఫిబ్రవరి । 2024



పోటెత్తిన ఉల్లి
సీజన్ ప్రారంభం కావడంతో దేవరకద్ర మార్కెట్‌కు బుధవారం ఉల్లి పోటెత్తింది.
వివరాలు 8లో ▸



ఉత్సవాలకు వేళాయె..
జడ్చర్ల లక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు గురువారం ప్రారంభం కానున్నాయి.
వివరాలు 10లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
37.3 /13.2

వాతావరణం
రోజంతా ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ వేడిమి.. ఉదయం, రాత్రి వేళల్లో చలి తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

హంసవాహనంపై ఊరేగిన వేంకటేశ్వరుడు



మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండ శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి స్వామివారికి హంసవాహన సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా శోభాయమానంగా అలంకరించిన హంసవాహనంపై స్వామివారిని గర్భగుడి నుంచి దేవస్థానం ముందున్న మండపం వరకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. బంగారు ఆభరణాలు, రకరకాల పూల అలంకరణల మధ్య హంసవాహనంపై ఊరేగుతూ భక్తకోటికి దర్శనమిచ్చారు. అనంతరం స్వామివారిని గర్భగుడిలోకి తీసుకెళ్లి అభిషేకాలు, అర్చనలు చేశారు. కార్యక్రమంలో దేవస్థాన చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్, ఈఓ శ్రీనివాసరాజు, సూపరింటెండెంట్ నిత్యానందచారి అర్చకులు పాల్గొన్నారు.

పీయూ సెమిస్టర్ ఫలితాలు విడుదల



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ సెమిస్టర్ 1, 3, 5 రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్ష ఫలితాలను పీయూ అధికారులు విడుదల చేశారు. ఈ మేరకు సెమిస్టర్ 1లో 21,743 మంది విద్యార్థులు పరీక్ష రాయగా ఇందులో 5,974 మంది పాసవగా 32.7 శాతం ఉత్తీర్ణత నమోదు చేశారు. సెమిస్టర్ 3లో 17,491 మంది పరీక్ష రాయగా 7,749 మంది ఉత్తీర్ణత సాధించగా.. 44.30 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఇక సెమిస్టర్ 5లో 13,211 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 6,758 మంది ఉత్తీర్ణులు కాగా 51.15 శాతం నమోదు చేశారు. కార్యక్రమంలో పీయూ వీసీ లక్ష్మీకాంత్ రాథోడ్, కంట్రోలర్ రాజ్‌కుమార్, మధుసూదన్‌రెడ్డి, చంద్రకిరణ్, విజయలక్ష్మి, అరంధతి తదితరులు పాల్గొన్నారు.

యూనివర్సిటీ స్థాయి సదుపాయాలు



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లాకేంద్రంలోని ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో యూనివర్సిటీ స్థాయి సౌకర్యాలు కల్పిస్తున్నట్లు ఆర్జేడీ రాజేందర్‌సింగ్ అన్నారు. బుధవారం కళాశాలలో 'ఉన్నత విద్యలో మెరుగైన అవకాశాలు' అనే అంశం ఏర్పాటు చేసిన ఒక్కరోజు వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. కళాశాలలోని డిగ్రీ, పీజీ కోర్సుల విద్యార్థులకు నిత్యం ఏదో ఒక అంశంపై అవగాహన కార్యక్రమాలు జరుగుతుండడం అభినందించదగ్గ విషయం అన్నారు. భవిష్యత్‌లో మరిన్ని పీజీ కోర్సులు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామన్నారు. విద్యార్థుల అవసరాన్ని గుర్తించి మరిన్ని తరగతి గదులు ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. అధ్యాపకులు అంతర్జాతీయ సెమినార్లు, పరిశోధన పత్రాలు సమర్పించడం, పుస్తకాల ప్రచురణ వంటి కార్యక్రమాలు చేపట్టాలన్నారు. విద్యార్థులు ప్రతి సంవత్సరం ప్రభుత్వం నిర్వహించే జిజ్ఞాస, యువతరంగం వంటి పోటీల్లో పాల్గొని మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీపాదగంగాధర్, ముంతాజ్ జహాన్, విజయలక్ష్మి, లావణ్య, సూరయ్య జబీన్ తదితరులు పాల్గొన్నారు.

కందులు @ రూ.10,005

జడ్చర్ల: బాదేపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం కందులకు క్వింటాలు గరిష్ఠంగా రూ.10,005, కనిష్ఠంగా రూ.9,500, ధర పలికింది. అదేవిధంగా వేరుశనగ క్వింటాలు గరిష్ఠంగా రూ.7,371, కనిష్ఠంగా రూ.4,611, పత్తి గరిష్ఠంగా రూ.6,659, కనిష్ఠంగా రూ.5,879, మొక్కజొన్న గరిష్ఠంగా రూ.2,311, కనిష్ఠంగా రూ.2,261, పెబ్బర్లు గరిష్ఠంగా రూ.7,624, కనిష్ఠంగా రూ.7,612 చొప్పున ధరలు లభించాయి.



కోస్గి బహిరంగ సభలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ అధికార ప్రతినిధి మల్లురవి, సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు వంశీచంద్‌రెడ్డి. ఉమ్మడి జిల్లాలోని ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, జి.మధుసూదన్‌రెడ్డి, వాకిటి శ్రీహరి, వీర్లపల్లి శంకర్, చిట్టెం పర్ణికారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, మాజీ మంత్రి జి.చిన్నారెడ్డి, మాజీ ఎమ్మెల్యే గుర్నాథ్‌రెడ్డి తదితరులు

పాలమూరును ఎండబెట్టి.. కొడంగల్‌ను ఎడారి చేశావ్

- రూ.వేలకోట్లు కాంట్రాక్టర్లకు ఇచ్చి కమీషన్లు దండుకున్నారు
- పార్లమెంట్ ఎన్నికల్లో వంశీచంద్‌ను గెలిపించండి
- మాజీ సీఎం కేసీఆర్, బీఆర్‌ఎస్ నాయకులపై సీఎం రేవంత్‌రెడ్డి ఫైర్
- మరో రూ.5వేల కోట్లతో అభివృద్ధికి బాటలు వేస్తా
- కోస్గిలో రూ.4,400 కోట్ల పనులకు శంకుస్థాపన

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్/ నారాయణపేట/ కోస్గి: 'పాలమూరు– రంగారెడ్డి ప్రాజెక్టు ముసుగులో రూ.వేల కోట్లు కాంట్రాక్టర్లకు ఇచ్చి కమీషన్లు దండుకున్నారు.. పాలమూరును ఎండబెట్టినవ్.. కొడంగల్‌ను ఎడారిగా మార్చినవ్.. ఈ ప్రాంతం నుంచి వలసలు ఆపకుండా చేసి.. బతుకుదెరువు కోసం లంబాడీ తండాల నుంచి పుణె, బొంబాయికి వలస వెళ్లిన వారి దగ్గరికి వెళ్లి ఓట్లు అడిగే పరిస్థితి తెచ్చుకున్నవ్..' అని సీఎం రేవంత్‌రెడ్డి కేసీఆర్‌ను ఉద్దేశించి అన్నారు. బుధవారం నారాయణపేట జిల్లా కోస్గిలో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసిన అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో ప్రజలనుద్దేశించి మాట్లాడారు. ఈ రోజు తెలంగాణ ముఖ్యమంత్రిగా కోస్గి గడ్డమీద నిలబడి మాట్లాడుతున్నానంటే కొడంగల్ ప్రజలు ఆశీర్వదించి అక్కున చేర్చుకొని మూడుసార్లు గెలిపించడం వల్లే సాధ్యమైందని, మీ అభిమానంతోనే ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ గుర్తించి తెలంగాణ ముఖ్యమంత్రిని చేసిందని రేవంత్‌రెడ్డి అన్నారు. కొడంగల్ ఎమ్మెల్యేగా గెలిచి.. సీఎంగా ఎన్నికై ఈ గడ్డ మీదకు 60 రోజుల తర్వాత వచ్చి సంతోషం పంచుకుంటున్నా. పెద్దల అండతో మీరు నాటిన మొక్క రాష్ట్రానికి వటవృక్షమై నీడనిస్తుంది.. ఉత్తమ్‌కుమార్, దామోదర రాజనర్సింహ, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, భట్టి విక్రమార్కల అండతో 60 రోజుల్లోనే కొడంగల్ నియోజకవర్గానికి రూ.5 వేల కోట్లు తెచ్చి.. అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశామని పేర్కొన్నారు.

ఢిల్లీలో కాంగ్రెస్ గెలిపిద్దాం

రూ.500లకే సిలిండర్, పేదలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రైతు రుణమాఫీ వంటి ఆరు గ్యారంటీలు అమలు కావాలంటే ఢిల్లీలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావాలని, అందుకు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు సిద్ధమేనా అని రేవంత్‌రెడ్డి అన్నారు. అందుకు సిద్ధమైతే చేతులు పైకి ఎత్తండి.. జై కాంగ్రెస్.. జై కాంగ్రెస్ అనాలి.. ఈ గళం ఢిల్లీలో మోదీకి.. ఫాంహౌజ్‌లో కేసీఆర్‌కు వినిపించాలని నినాదాలతో హోరెత్తించారు.





కోస్గి బహిరంగ సభకు హాజరైన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు

7.10 టీఎంసీలు.. 1.07 లక్షల ఎకరాలు

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు టీడీపీ నుంచి మొదటిసారి ఎమ్మెల్యే అయినప్పుడు పేట– కొడంగల్ ఎత్తిపోతల పథకం 69 జీఓను తీసుకువచ్చా.. 7.10 టీఎంసీలతో 1.07 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడమే లక్ష్యంగా ఎత్తిపోతలు మంజూరు చేయించానని సీఎం చెప్పారు. ఉమ్మడి రాష్ట్రంలో అన్యాయం జరిగిందంటే సరే అనుకోవచ్చు.. ఇక్కడి ప్రజల ఓట్లతో పాలమూరు ఎంపీగా గెలిచి.. స్వరాష్ట్రంలోనూ పేట– కొడంగల్ పథకాన్ని పదేళ్ల పట్టించుకోలేదంటే అది బీఆర్‌ఎస్ దుర్మార్గం కాదా అని ప్రశ్నించారు. ఇప్పుడు ఈ పథకం పూర్తిచేసి బీడు భూములకు సాగునీరు అందిస్తానని ఉద్ఘాటించారు.

వంశీచంద్‌రెడ్డిని గెలిపించండి

కృష్ణా– వికారాబాద్ రైల్వేలైన్ రావాలన్నా.. కోస్గిలో సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలన్నా.. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు పరిశ్రమలు నెలకొల్పాలన్నా.. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా వంశీచంద్‌రెడ్డిని గెలిపించాలని రేవంత్‌రెడ్డి కోరారు. కొడంగల్ నియోజకవర్గంలో 50 వేల మెజార్టీ ఇస్తే పెద్దలను ఒప్పించి మరో రూ.5 వేల కోట్లు తెచ్చి అభివృద్ధికి బాటలు వేస్తానని ప్రకటించారు.

రేవంత్‌రెడ్డి వల్లనే..



పాలమూరు బిడ్డ రాష్ట్రానికి ముఖ్యమంత్రి కావడం, మూడుసార్లు కొడంగల్ ప్రజలు ఎమ్మెల్యేగా గెలిపించడం వల్లే ఈ ప్రాంతానికి దేశస్థాయిలో పేరుతో పాటు నియోజకవర్గం సస్యశ్యామలం అవుతుందని సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన 60 రోజుల్లోనే రూ.2,945 కోట్లతో ప్రాజెక్టు నిర్మాణానికి శంకుస్థాపన చేయడం శుభసూచకమన్నారు. జిల్లాలో రేవంత్‌రెడ్డి పిలుపు మేరకు 12 ఎమ్మెల్యే స్థానాలను గెలిపించారని, వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లోనూ రెండు పార్లమెంట్ స్థానాలను గెలిపించి సీఎంకు బహుమతిగా ఇచ్చి మరింత బలం చేకూర్చాలని కోరారు.

కేసీఆర్‌కు అవకాశం ఇవ్వొద్దు



రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ పగటి కలలు కంటున్న కేసీఆర్‌కు భవిష్యత్‌లో అవకాశం ఇవ్వొద్దని అన్నారు. యావత్ తెలంగాణ ప్రజానీకం పదేళ్ల కుటుంబ పాలనను అంతం చేసి.. అభివృద్ధి, సంక్షేమ పాలనకు పట్టం కట్టారన్నారు. అనతికాలంలోనే భీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ కల్వకుర్తి ప్రాజెక్టుల్లో పెండింగ్ పనులు పూర్తి చేసి ఉమ్మడి పాలమూరు జిల్లాను సస్యశ్యామలం చేస్తామన్నారు.



■ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్, సికింద్రాబాద్‌తో పాటు నల్లగొండలో తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నా.. మూసినది ప్రక్షాళనకు ఎందుకు చర్యలు తీసుకోలేదని మాజీ సీఎం కేసీఆర్‌ను ప్రశ్నించారు. ప్రస్తుతం ప్రతి విషయంలో ఆలోచించి అందరం సమిష్టిగా ముందుకు వెళ్తున్నామన్నారు.



■ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఒక నియోజకవర్గంలో భారీ స్థాయిలో నిధులు వెచ్చించి అభివృద్ధి పనులు చేపట్టడం ఇదే మొదటిసారి అని, ఇందుకు సీఎం రేవంత్‌రెడ్డిని అభినందిస్తున్నా అన్నారు. రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో తనదైన ముద్ర వేసుకున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో మేమందరం కలిసి ముందుకు వెళ్తామని, దేశంలోనే తెలంగాణను ఆదర్శంగా నిలబెడతామన్నారు. పాలమూరు– రంగారెడ్డి ఎత్తిపోతలతోపాటు.. కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్ వంటి అన్ని ఇరిగేషన్ ప్రాజెక్టులు త్వరగా పూర్తి చేసి ఉమ్మడి పాలమూరులోని ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తామన్నారు.

దేశం కోసం బీజేపీకి ఓటేయండి



క్లాక్‌టవర్‌లో కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి, చిత్రంలో డీకే అరుణ తదితరులు

- ప్రజలు మూడోసారి ప్రధానిగా మోదీనే కోరుకుంటున్నారు : కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి

స్టేషన్ మహబూబ్‌నగర్/ దేవరకద్ర/ కొత్తకోట రూరల్: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో దేశం కోసం, పిల్లల భవిష్యత్ కోసం బీజేపీకి ఓటేయాలని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అన్నారు. దేశంలోని అన్నివర్గాల ప్రజలు మూడోసారి ప్రధానిగా మోదీనే కోరుకుంటున్నారని చెప్పారు. బీజేపీ చేపట్టిన విజయ సంకల్ప యాత్ర బుధవారం నారాయణపేట, కొత్తకోట, దేవరకద్ర మీదుగా మహబూబ్‌నగర్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా రాత్రి 8 గంటల ప్రాంతంలో స్థానిక క్లాక్‌టవర్‌లో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో కిషన్‌రెడ్డి మాట్లాడారు. మోదీ హయాంలోనే ఉమ్మడి జిల్లాలో అధిక మొత్తంలో జాతీయ రహదారులు నిర్మించామని, జిల్లాలో సింగిల్ లైన్లను డబుల్ లైన్లుగా మార్చినట్లు వివరించారు. పాలమూరును అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తామని, ఇందులో భాగంగా జిల్లా విద్యార్థుల కోసం పాలమూరు యూనివర్సిటీకి రూ.100 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. ప్రతి పేదవాడికి అన్ని సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. అయోధ్యలో శ్రీరామమందిరం నిర్మాణంతో దేశ ప్రజల ఆకాంక్ష నెరవేర్చడం మోదీకే సాధ్యమైందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఏనాడు దేశ ప్రజల సంక్షేమం గురించి ఆలోచించలేదన్నారు. తెలంగాణలో అవినీతి బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని ప్రజలు ఓడగొట్టారని, కానీ, పెనం నుంచి పొయ్యిలో పడిన చందంగా.. గ్యారంటీలతో ప్రజలను మభ్యపెట్టి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. యువతకు రూ.4 వేలు, మహిళలకు రూ.2,500లు ఎప్పుడిస్తారని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ అవినీతి పార్టీలేనని ఆరోపించారు.

కాంగ్రెస్‌కు డిపాజిట్ రావొద్దు..

దేశంలో అతి పెద్ద పార్టీగా బీజేపీ 302 సీట్లతో ఉందని, కాంగ్రెస్ కేవలం 40 సీట్లకే పరిమితమైందని, ఒకవేళ కాంగ్రెస్ గెలిచినా సోనియాకు ఊడిగం చేయడం తప్ప ఏమి ఉండదన్నారు. ఢిల్లీలో ఈ నెల 17, 18 తేదీల్లో నిర్వహించిన పార్టీ సమావేశంలో ఎన్నికల ప్రచారానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్లు వివరించారు. బీజేపీ సొంతంగా 370 సీట్లు గెలవాలనే లక్ష్యంపై పూర్తి విశ్వాసం ఉందన్నారు. ఈసారి బీజేపీ కూటమికి 400 సీట్లు రావడం ఖాయమని, కాంగ్రెస్‌కు డిపాజిట్ రాకుండా చేయాలని కోరారు. బీఆర్‌ఎస్ నిన్నటికే పరిమితమైందని, రేపు అనేది ఆ పార్టీకి లేదని విమర్శించారు. కేసీఆర్ పని అయిపోయిందని, ఆ పార్టీని ప్రజలు నమ్మే స్థితిలో లేరని బీఆర్‌ఎస్‌కు ఓటు వేసినా దండగే అన్నారు.

■ మాజీ మంత్రి డీకే అరుణ మాట్లాడుతూ దేశ ప్రజలు నరేంద్రమోదీనే ప్రధాని కావాలని కోరుకుంటున్నారని చెప్పారు. అమలుకు నోచుకోని హామీలతో కాంగ్రెస్ ప్రజలను మోసం చేసిందని, మరోసారి వారి మాటలు నమ్మి మోసపోవద్దని కోరారు. మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ నిద్రాహారాలు మానుకుని దేశ ప్రజల సంక్షేమమే ధ్యేయంగా 18 గంటలు పనిచేస్తున్న మోదీని మరోసారి ప్రధాని చేసేందుకు అందరం కలిసికట్టుగా పనిచేయాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో సీనియర్ రాష్ట్ర నాయకులు శాంతికుమార్, ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రావుల రవీంద్రనాథ్‌రెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, ఎగ్గని నర్సింహులు, బంగారు శ్రుతి, నాగూరావు నామాజీ, రతంగ్‌పాండురెడ్డి, కొండయ్య, ఆయా జిల్లాల పార్టీ అధ్యక్షులు నారాయణ, శ్రీనివాసులు, శ్రీనివాస్ రెడ్డి, మిథున్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, శ్రీవర్ధన్‌రెడ్డి, నంబిరాజు, లక్ష్మి, సత్యంయాదవ్ పాల్గొన్నారు.



కార్నర్ మీటింగ్‌కు హాజరైన కార్యకర్తలు

బీఆర్‌ఆర్ డిగ్రీ కళాశాలను సందర్శించిన న్యాక్



కళాశాలలో జ్యోతి వెలిగించే కార్యక్రమంలో పాల్గొన్న న్యాక్ బృందం

జడ్చర్ల టౌన్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలను బుధవారం యూజీసీ న్యాక్ బృందం సందర్శించింది. గతేడాది న్యాక్‌బృందం సందర్శించి పాత గ్రేడ్‌నే కొనసాగించడంతో ప్రిన్సిపల్, పూర్వ విద్యార్థుల సంఘం యూజీసీని ఆశ్రయించింది. దీంతో గ్రేడ్ కేటాయింపు పరిశీలనకు న్యాక్ బృందం మరోసారి పర్యటిస్తోంది. న్యాక్ బృందానికి చైర్మన్‌గా వ్యవహరిస్తున్న కర్ణాటక హసన్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ టీసీ ధారనాథ్, మెంబర్ కోఆర్డినేటర్ తిరుపతి వెంకటేశ్వర యూనివర్సిటీ ప్రొఫెసర్ జయచంద్రరెడ్డి, సభ్యుడు అస్సాం జేబీ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ భీమాల్ భరత్ కళాశాలను సందర్శించారు. మొదటి రోజు బృందానికి ప్రిన్సిపల్ అప్పియా చిన్నమ్మ, అధ్యాపకులు ఘన స్వాగతం పలికి.. కళాశాల కార్యకలాపాలు వివరించారు. అనంతరం ప్రతి విభాగాన్ని సందర్శించి రికార్డులు పరిశీలించారు. తర్వాత ఈడీసీ, ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్–1, 2, 3 యూనిట్లు, మహిళా సాధికారత విభాగం, నీటి సంరక్షణ కేంద్రం, బాలసదనం, కంప్యూటర్ ప్రయోగశాల, రెడ్ రిబ్బన్ క్లబ్, యూత్ రెడ్‌క్రాస్, ఫిర్యాదుల పరిష్కార విభాగం, అంతర్గత ఫిర్యాదుల విభాగం, యాంటీ ర్యాగింగ్, కెరీర్ గైడెన్స్ సెల్, ప్లేస్‌మెంట్ సెల్, గ్రంథాలయం, జిమ్నాజియం, ఆరోగ్య కేంద్రం, పూర్వ విద్యార్థులతో సమావేశం, విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించారు. అనంతరం యోగా కేంద్రం, తెలంగాణ రాష్ట్ర హెర్బేరియం కేంద్రం, సెమినార్ హాల్, ఇండోర్ స్టేడియం, ఐక్యూసీ కేంద్రాలను సందర్శించారు. సాయంత్రం కళాశాల ప్రాంగణంలో విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. బృందం వెంట వైస్ ప్రిన్సిపల్ శ్రీనివాసులు, అకాడమిక్ కోఆర్డినేటర్ భక్షిరవీందర్‌రావు, ఆయా విభాగాల అధిపతులు, అధ్యాపకులు డా.సుభాషిణి, నరసింహారావు, రమాదేవి, ప్రవీణ్‌కుమార్, ఉదయ్‌కుమార్, మంజుల, సాయికొండలు, శ్రీనివాసులు, నీరజ, మంజుల, కవిత, యాదయ్య, సదాశివయ్య తదితరులున్నారు.

పోలీసులు సేవా దృక్పథంతో పనిచేయాలి

జడ్చర్ల: పోలీసులు ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండి సేవా దృక్పథంతో పనిచేయాలని ఎస్పీ హర్షవర్ధన్ పేర్కొన్నారు. బుధవారం జడ్చర్ల శివారులోని జిల్లా పోలీసు శిక్షణా కేంద్రం (డీటీసీ)లో ఆదిలాబాద్, నిర్మల్, ఆసిఫాబాద్ జిల్లాల నుంచి వచ్చిన 213 మంది ఎస్‌సీటీపీసీ (సివిల్) అభ్యర్థులకు తొమ్మిది నెలల పాటు కొనసాగనున్న బేసిక్ ఇండక్షన్ ట్రెనింగ్ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ శిక్షణకు వచ్చిన అభ్యర్థులకు పలు సూచనలు చేశారు. సమాజంలో అనేక రకాలుగా మోసాలు, నేరాలు జరుగుతుంటాయని వాటిని అరికట్టేందుకు శిక్షణలో పలు విషయాలపై అవగాహన కల్పిస్తారన్నారు. డీటీసీలో 9 నెలలపాటు కొనసాగే శిక్షణలో అనేక అంశాలను నేర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. విధి నిర్వహణలో ఎదురయ్యే సమస్యలను చట్ట పరిధిలో ఎలా పరిష్కరించాలో తెలుసుకోవాలన్నారు. పోలీస్ శాఖ పరువు, ప్రతిష్ట క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించే కానిస్టేబుళ్లపైనే ఆధారపడి ఉంటుందన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ఎమ్మెస్సీ, బీటెక్ తదితర ఉన్నత విద్యను అభ్యసించిన వారు సైతం పోలీసు ఉద్యోగాలను ఎంచుకోవడం అభినందనీయమన్నారు. అంకితభావం, మంచి వ్యక్తిత్వంతో, క్రమశిక్షణతో ప్రజలకు సేవలందించి పోలీసు శాఖకు ఖ్యాతి తీసుకురావాలన్నారు. ప్రజలకు సేవచేసే భాగ్యం పోలీసులకు లభించడం గర్వకారణం అన్నారు. ప్రజలతో మంచి సంబంధాలు కలిగి ఉండాలని, విధి నిర్వహణలో మానవతా దృక్పథం కూడా ప్రదర్శించాల్సి ఉంటుందన్నారు. పోలీస్ వృత్తిలో రాణించేందుకు శిక్షణ ఉపయోగపడుతుందని, శిక్షణను సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం శిక్షణకు సంబంధించిన పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీటీసీ డీఎస్పీ రామారావు, ఇన్‌స్పెక్టర్ బాలస్వామి, సీఐ ఆదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అభ్యర్థులకు పుస్తకాలను పంపిణీ చేస్తున్న ఎస్పీ హర్షవర్ధన్

పీయూలో విద్యార్థి సంఘాల నిరసన

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో లా, ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం పలు విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ పీయూలో లా కళాశాల ఏర్పాటు చేయడం వల్ల ఎంతో మంది పేద విద్యార్థులకు న్యాయం జరుగుతుందని, పాలమూరు జిల్లా నుంచి ఎంతో మంది లాయర్లు వచ్చే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ, ఎస్‌ఎఫ్‌ఐ, బీఆర్‌ఎస్వీ, స్వేరోస్ తదితర సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రూ.4,369.143 కోట్ల అభివృద్ధి పనులు



మహిళలు తయారు చేసిన మట్టి పాత్రలను పరిశీలిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలు

నారాయణపేట/కోస్గి/మద్దూరు: కొడంగల్ నియోజకవర్గం కోస్గిలో స్విచ్ ఆన్ చేసి ఒకేసారి రూ.4,369.143 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన చేశారు.

ఆడబిడ్డలను కోటీశ్వరులను చేస్తాం

రాష్ట్రంలో ఆడబిడ్డలందరినీ కోటీశ్వరులను చేయడమే లక్ష్యమని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. బుధవారం సాయంత్రం ఫుట్‌బాల్ మైదానంలో ఏర్పాటు చేసిన మహిళ స్వయం సహాయక సంఘాల ఆత్మీయ సమావేశానికి హాజరయ్యారు. అక్కడ పోలీస్ గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం కొడంగల్ నియోజకవర్గానికి సంబంధించి సుమారు రూ.4,400 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఆ తర్వాత మహిళా స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించి.. మహిళా సంఘాల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కుటుంబం ఆర్థికంగా బాగుపడాలంటే ఆడపిల్లల చేతిలో నగదు ఉండాలన్నదే తమ ఉద్దేశమని, దీన్ని దృష్టిలో పెట్టుకొని సంఘాలను బలోపేతం చేస్తామన్నారు. ఇదివరకే మహిళా సంఘాలకు రాష్ట్రంలోని పాఠశాలలు, రెసిడెన్షియల్ కళాశాలలు, హాస్టల్ విద్యార్థుల యూనిఫామ్స్ కుట్టే పనిని అప్పగిస్తామని చెప్పినట్లు గుర్తు చేశారు. దీంతో పాటు నూతన మిషన్లు ఇస్తామని, ఆర్థిక సహకారం అందిస్తామన్నారు. దీంతో గ్రామీణ మహిళలు బలపడతారని తెలిపారు. గతంలో కోస్గి ప్రాంతంలో మహిళా సంఘాలు కందులను కొనుగోలు చేసి ఒక్కొక్కసారి నష్టాలను చవిచూశారని , ఈ నేపథ్యంలో ఐకేపీ ద్వారా రుణాలను ఇవ్వడమే కాకుండా, ఐకేపీ సంఘాలను బలోపేతం చేస్తామన్నారు. పంటలన్నింటినీ ఐకేపీ ద్వారా కొనుగోలు చేస్తామని, బట్టలు కుట్టే పనితో పాటు ఇతర పనులు కల్పిస్తామన్నారు. పోలేపల్లి, హుస్నాబాద్ గ్రామాలకు మహిళా సమాఖ్య భవనాలను మంజూరు చేస్తున్నట్లు ఈ సందర్భంగా సీఎం ప్రకటించారు.

సీఎం పర్యటన సాగిందిలా..

- సాయంత్రం 5:02 గంటలకు కోస్గికి చేరుకున్నారు.
- 5:10గంటలకు అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- 5:30గంటలకు మహిళా సంఘాలతో మాటామంతి
- 5:45గంటలకు మహిళలకు చెక్కుల పంపిణీ
- 6 గంటలకు మంత్రులతో కలిసి స్టాల్స్ తిలకించిన సీఎం
- 6:35గంటలకు బహిరంగ సభావేదికపైకి చేరుకున్నారు.
- 6:45గంటలకు పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి సభాధ్యక్షతన సమావేశం ప్రారంభం
- 7:21 గంటలకు సీఎం ప్రసంగం ప్రారంభం .. 7:46గంటలకు ముగింపు. (25 నిమిషాల పాటు సాగిన ముఖ్యమంత్రి ప్రసంగం)
- 7.50 గంటలకు రోడ్డుమార్గంలో కొడంగల్ మీదుగా హైదరాబాద్‌కు పయనం

❒ మహిళా సంఘాల్లోని 3083 మంది సభ్యులకు రూ. 177.53 కోట్ల రుణాల చెక్కును సీఎం అందజేశారు. కోస్గి పట్టణానికి చెందిన నారాయణ రెడ్డి అనే వ్యక్తి అందించిన అంబులెన్స్‌ను ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మంత్రులు దామోదర్‌రాజనరసింహ, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ అధికార ప్రతినిధి మల్లురవి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఏ.శాంతికుమారి, ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, వంశీకృష్ణ, చిట్టెం పర్ణికా రెడ్డి, వాకిటి శ్రీహరి, కసిరెడ్డి నారాయణరెడ్డి, మేఘారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, వీర్లపల్లి శంకర్, మందుల శ్యామెల్, కలెక్టర్లు కోయశ్రీహర్ష, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శంకుస్థాపనలు ఇలా..

- ❒ రూ.2,945 కోట్లతో నారాయణపేట–కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ పథకానికి శంకుస్థాపన
- ❒ రూ.6.8 కోట్ల అంచనా వ్యయంతో కొడంగల్‌లో ఆర్‌అండ్‌బీ అతిథి గృహ నిర్మాణం
- ❒ రూ.344.5 కోట్ల అంచనా వ్యయంతో కొడంగల్ నియోజకవర్గ వ్యాప్తంగా సింగిల్ లేన్ నుంచి డబుల్ లేన్ రోడ్లు, వాటి విస్తరణ, పలు బ్రిడ్జిల నిర్మాణాలకు శంకుస్థాపన
- ❒ రూ.27.886 కోట్లతో వికారాబాద్ జిల్లాలో బీటీ రోడ్డు సదుపాయం లేని మారుమూల గిరిజన ప్రాంతాలకు రోడ్లు వేసేందుకు శంకుస్థాపన
- ❒ రూ.5 కోట్లతో గిరిజన సంక్షేమ హాస్టల్ భవనానికి భూమి పూజ
- ❒ రూ.25 కోట్లతో మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్ శాశ్వత భవనానికి..
- ❒ రూ.40 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన
- ❒ రూ.7.13 కోట్లతో దౌల్తాబాద్ జూనియర్ కళాశాల
- ❒ రూ.7.13 కోట్లతో బొంరాస్‌పేట జూనియర్ కళాశాల
- ❒ రూ.25 కోట్లతో దౌల్తాబాద్ మండలం నీటూర్‌లో మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ రెసిడెన్షియల్ స్కూల్/కళాశాల
- ❒ రూ.360 కోట్లతో చంద్రకల్ గ్రామం,దౌల్తాబాద్ మండలంలో నూతన వెటర్నరీ కళాశాల నిర్మాణం
- ❒ రూ.30 కోట్లతో కోస్గి మండల కేంద్రంలో ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాల
- ❒ రూ.11 కోట్లతో కోస్గి మండల కేంద్రంలో మహిళా డిగ్రీ కళాశాలకు శంకుస్థాపన
- ❒ రూ.20 కోట్లతో మద్దూర్ మండలకేంద్రంలో బాలికల సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్/జూనియర్ కళాశాల
- ❒ రూ.25 కోట్లతో కొడంగల్ మండల కేంద్రంలో బాలుర సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్/జూనియర్ కళాశాల
- ❒ రూ.224.50 కోట్లతో మెడికల్ కళాశాల, నర్సింగ్ కళాశాల, ఫిజియోథెరపీ కళాశాల, 220 పడకల హాస్పిటల్
- ❒ రూ.213.2070 కోట్లతో కొడంగల్ నియోజకవర్గంలో హెచ్‌ఎల్‌బీఎస్, అప్రోచ్ రోడ్ పనులు
- ❒ రూ.3.99 కోట్లతో దుద్యాల్ మండలంలోని హస్నాబాద్ నూతన 33/11 కేవీ సబ్ స్టేషన్.



సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించిన వివిధ అభివృద్ధి పనుల శిలాఫలకాలు



మహిళా సంఘాలకు చెక్కు అందజేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు దామోదర రాజనరసింహ, జూపల్లి కృష్ణారావు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

క్లుప్తంగా

పురుగుమందు తాగి వివాహిత బలవన్మరణం

ఉప్పునుంతల: పురుగుమందు తాగి వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఉప్పునుంతల మండలం తాడూరులో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. తాడూరుకు చెందిన బాత్క పద్మ (32) రోజు మాదిరిగానే బుధవారం తన భర్త రేణయ్యతో కలిసి వ్యవసాయ పొలానికి వెళ్లింది. వేరుశనగ పంటకు రేణయ్య స్ప్రింక్లర్ పైపులు వేస్తుండగా.. కొంత దూరంలో ఉన్న పద్మ పురుగుమందు తాగింది. కొంత సేపటి తర్వాత గమనించిన భర్త రేణయ్య ఆమెను బైక్‌పై అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతురాలికి కూతురు, కుమారుడు ఉన్నారు. కుటుంబంలో గొడవల కారణంగా పద్మ ఆత్మహత్యకు పాల్పడి ఉంటుందని గ్రామస్తులు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

జడ్చర్ల: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు ఎస్‌ఐ చంద్రమోహన్ తెలిపారు. ఎస్‌ఐ కథనం మేరకు..రంగారెడ్డి జిల్లా కేశంపేట మండలం తొమ్మిది రేకుల గ్రామానికి చెందిన బీంరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి(38) ఈ నెల 16న జడ్చర్ల మండలం గంగాపూర్‌లో జరిగే లక్ష్మిచెన్నకేశవ స్వామి రథోత్సవానికి హాజరయ్యేందుకు మోటార్ బైక్‌పై ఇంటి నుంచి బయలు దేరాడు. కోడ్గల్ గ్రామ సమీపంలో బైక్ అదుపుతప్పి కిందపడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. బుధవారం మృతుడి భార్య స్వప్న ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బాలికపై అత్యాచారం: కేసు నమోదు

నాగర్‌కర్నూల్ క్రైం: బాలికపై అత్యాచారం జరిగిన సంఘటన మండల పరిధిలోని ఓ గ్రామంలో సోమవారం సాయంత్రం చోటుచేసుకోగా.. బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ గోవర్దన్ తెలిపిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని ఓ గ్రామంలో 13ఏళ్ల బాలిక సోమవారం వ్యవసాయ పొలానికి కట్టెల కోసం వెళ్తుంది. ఇద్దరు యువకులు బాలికపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఇంటికి వెళ్లిన బాలిక తల్లిదండ్రులకు విషయం తెలియజేయడంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సంఘటనకు సంబంధించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలియజేశారు.

చోరీ కేసులో మహిళకు జైలు శిక్ష

నాగర్‌కర్నూల్ క్రైం: చోరీ కేసులో మహిళకు జైలుశిక్ష, జరిమానా విధిస్తూ.. నాగర్‌కర్నూల్ జూనియర్ సివిల్ జడ్జి పుట్ట మౌనిక బుధవారం తీర్పు వెల్లడించారు. వివరాలు ఇలా ఉన్నాయి. 8 నవంబర్ 2016 సంవత్సరంలో జిల్లా కేంద్రంలో ఓ ఇంట్లో బాలుడు బంగారు నగలతో పాటు ఫోన్‌ను చోరీ చేశాడు. చోరీకి పాల్పడిన రెండు తులాల బంగారు నగలు, ఫోన్‌ను మున్సిపాల్టీ పరిధిలోని ఎండబెట్లకి చెందిన లక్ష్మమ్మ వద్ద ఉంచాడు. కేసు నమోదు చేసిన పోలీసులు విచారణలో లక్ష్మమ్మ వద్ద బంగారు నగలు, ఫోన్ ఉన్నట్లు గుర్తించారు. చోరీకి సహకరించిందని ఆమెను కోర్టులో హాజరుపరిచారు. చోరీ కేసు కోర్టులో విచారణలో ఉండగా.. బుధవారం తుది తీర్పును జూనియర్ సివిల్ జడ్జి పుట్ట మౌనిక వెల్లడించారు. లక్ష్మమ్మకు 2 సంవత్సరాల జైలుశిక్షతో పాటు రూ.2 వేలు జరిమానా విధించారు. కోర్టులో వాదనలు వినిపించి నిందితురాలికి శిక్షపడేలా చేసిన అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రఘునాథ్‌రెడ్డిని, కోర్టు కానిస్టేబుల్ నరేష్‌ను జడ్జి అభినందించారు.

షార్ట్‌సర్క్యూట్‌తో రూ.30 లక్షల ఆస్తినష్టం

గద్వాల క్రైం: ప్రమాదవశాత్తు షార్ట్‌సర్క్యూట్ జరిగిన సంఘటనలో రూ.30 లక్షల ఆస్తి నష్టం చోటుచేసుకుంది. బాధితులు, ఫైర్ సిబ్బంది కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. జిల్లా కేంద్రంలోని చిన్నఅగ్రహారం కాలనీలోని ఓ ఇంటిని అద్దెకు తీసుకుని మల్దకల్ మండలానికి చెందిన చంద్రబాబు కొన్ని సంవత్సరాలుగా రమేష్ క్లాత్ షోరూం దుకాణం ఏర్పాటు చేసుకుని వస్త్ర వ్యాపారం నిర్వహిస్తున్నాడు. అయితే మంగళవారం ఉదయం దుకాణంలో షార్ట్ సర్క్యూట్ చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో మంటలు వ్యాప్తిచెంది దుకాణంలో విలువైన వస్త్రాలు, సామగ్రి దగ్ధమైంది. గమనించిన స్థానికులు ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. వారు సంఘటన స్థలానికి చేరుకుని దాదాపు 20 నిమిషాల పాటు శ్రమించి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. విషయం తెలుసుకున్న జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సరిత, ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి, వివిధ పార్టీలకు చెందిన నాయకులు బాధితుడిని ఓదార్చారు. ప్రభుత్వం నుంచి అన్ని విధాలుగా ఆదుకుంటామని భరోసా కల్పించారు. ప్రమాదంపై ఏమైన అనుమానాలు ఉంటే సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాల్సిందిగా బాధితుడికి వివరించారు.

ఇసుక తరలించవద్దని గ్రామస్తులు ఆందోళన



అయ్యవారిపల్లిలో ఇసుక తరలించవద్దని ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

మిడ్జిల్: మండల పరిధిలోని అయ్యవారిపల్లిలో గతేడాది ఇసుక తరలించేందుకు అనుమతులు రాగా.. అనుమతులు పొందిన వారు ఇసుకను దుందుభి వాగు నుంచి బయట కుప్పలుగా పోశారు. అప్పట్లో గ్రామస్తులు, ప్రతిపక్ష పార్టీల వారు ఇసుక తరలింపును అడ్డుకున్నారు. ఆ ఇసుకను సీజ్ చేశారు. ఇపుడు టీఎస్‌ఎండీసీ ద్వారా సీజ్ చేసిన ఆ ఇసుకను మహబూబ్‌నగర్ మెడికల్ కాలేజీ నిర్మాణానికి అనుమతులు ఇవ్వడంతో ఇసుక తరలిస్తున్నారు. బుధవారం గ్రామస్తులు వాటిని అడ్డుకొని ఆందోళన చేపట్టారు. సంఘటన స్థలానికి జడ్చర్ల రూరల్ సీఐ నాగార్జున, ఎస్‌ఐ ఆనంద్ గ్రామస్తులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ప్రభుత్వ పనులకు అనుమతులు ఇచ్చారని, వాటిని అడ్డుకోవద్దని సూచించారు. కాని గ్రామస్తులు మా ఊరి నుంచి ఇసుక తరలించవద్దని భీష్మించుకోవడంతో ఇసుక టిప్పర్లను తిరిగి పంపించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఇసుక రవాణాను దగ్గరుండి అడ్డుకున్న ప్రస్తుత ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి.. ఇప్పుడు న్యాయం చేయాలని గ్రామస్తులు కోరారు.

రోడ్డు ప్రమాదం కేసులో వ్యక్తికి జైలుశిక్ష

చిన్నంబావి: ఓ రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతిచెందగా.. ఆ కేసుకు సంబంధించి ట్రాక్టర్ డ్రైవర్ అజాగ్రత్తే ప్రమాదానికి కారణమంటూ అతనికి ఏడాది జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా జడ్జి విధించారని ఎస్‌ఐ రమేష్ బుధవారం తెలిపారు. వివరాలిలా.. 2017లో మండలంలోని వెలగొండకు చెందిన నల్లబోతు చిన్నరాములు, కడెం రాముడు, హుస్సేన్ కలిసి వీపనగండ్ల నుంచి ట్రాక్టర్‌పై విద్యుత్ స్తంభాలను తరలిస్తుండగా వెలగొండ సమీపంలో ట్రాక్టర్ బోల్తా పడింది. ఈప్రమాదంలో చిన్నరాములు, కడెం రాముడు, హుస్సేన్ అక్కడికక్కడే మృతి చెందారు. ట్రాక్టర్ డ్రైవర్ బీచుపల్లి ప్రాణాలతో బయటపడ్డాడు. ఈ ప్రమాదానికి డ్రైవర్ అజాగ్రత్త, అతివేగం ప్రధాన కారణమని కోర్టులో తేలడంతో అతనికి ఏడాది జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా పడిందని ఎస్‌ఐ తెలిపారు.

రిజర్వాయర్ సర్వేను అడ్డుకున్న రైతులు

అచ్చంపేట: అచ్చంపేట లిఫ్ట్‌లో భాగంగా నిర్మించనున్న ఉమామహేశ్వర రిజర్వాయర్‌కు సంబంధించి ప్రాథమిక భూ సర్వేను రైతులు అడ్డుకున్నారు. బుధవారం నీటిపారుదలశాఖ డీఈ బాలస్వామి, ఏఈ రమేష్, రెవెన్యూశాఖ సర్వేయర్ ప్రాథమిక సర్వే చేపట్టేందుకు రిజర్వాయర్ నిర్మించే ప్రాంతానికి వెళ్లారు. విషయం తెలుసుకున్న బల్మూర్ గ్రామ రైతులు అక్కడికి చేరుకొని సర్వే చేయకుండా అధికారులను అడ్డుకున్నారు. దీంతో ఇరువురి మధ్య కాసేపు వాగ్వాదం చోటుచేసుకుంది. రిజర్వాయర్ నిర్మించే ప్రాంతంలో సెంటర్ పాయింట్ అలైన్‌మెంట్ చూసుకోవడంతో పాటు (ఎంజాయిమెంట్ సర్వే) ఏ రైతు మోఖాలో ఉన్నారనే విషయం తెలుసుకునేందుకు అధికారులు, గతంలో సర్వే చేసిన ఏజెన్సీ బృందం వెళ్లగా రైతులు అడ్డుకోవడంతో వెనుదిరిగారు. రిజర్వాయర్‌కు సంబంధించి పనులు గతంలో నాగర్‌కర్నూల్ డివిజన్–3లో ఉండగా ఇటీవల అచ్చంపేట డివిజన్–2కు బదలాయించారు.



ఉమామహేశ్వరం రిజర్వాయర్ భూసర్వేను అడ్డుకుంటున్న రైతులు

పట్టపగలే ఇంట్లో చోరీ

అమరచింత: పట్టణంలోని శివాజీ నగర్‌లోని హర్ష శ్రీనివాస్ ఇంట్లో పట్టపగలే గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి రూ.పదివేల నగదును అపహరించుకుని వెళ్లినట్లు బాధితుడు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మంగళవారం ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లామని, మధ్యాహ్నం ఇంటికి తిరిగి రాగా.. ఇంటి తలుపునకు వేసిన తాళం పగలగొట్టి ఉండటం గమనించామన్నారు. ఇంటి తలుపులు తెరిచి చూడగా.. బీరువాను తెరిచి అందులో ఉన్న రూ.10వేల నగదుతో పాటు పిల్లలు ఏర్పాటు చేసుకున్న గల్లబుడ్డిని పగులగొట్టి వాటిలోని డబ్బులను తీసుకెళ్లినట్లు చెప్పారు. ఈ సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు.

ధరలు ఎలా వస్తున్నాయ్..?

- ఆరా తీసిన మార్కెటింగ్, వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు

జడ్చర్ల: వ్యవసాయ మార్కెట్‌కు విక్రయానికి వస్తున్న పంట దిగుబడులకు ధరలు ఎలా వస్తున్నాయి.. రైతులు పడుతున్న ఇబ్బందులు ఏమిటి.. ధరల కేటాయింపుపై రైతులు ఎందుకు అసంతృప్తిగా ఉన్నారంటూ మార్కెటింగ్, వ్యవసాయ శాఖల ఉన్నతాధికారుల బృందం బుధవారం క్షేత్రస్థాయిలో విచారించింది. ఉమ్మడి జిల్లాలో ఇటీవల వేరుశనగ రైతులు గిట్టుబాటు ధరల కోసం ఆందోళనలు చేసిన నేపథ్యంలో ప్రభుత్వం ఆయా శాఖల అధికారుల ఆధ్వర్యంలో విచారణకు ఆదేశించింది. దీంతో బాదేపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో మార్కెటింగ్ శాఖ జాయింట్ డైరెక్టర్ శ్రీనివాసులు, కమిషనరేట్ ఏడీఏ తిరుపతి ఇతర అధికారులు పర్యటించారు. యార్డు ఆవరణలో వారు కలియతిరిగి రైతులతో మాట్లాడారు. వేరుశనగ ఇతర పంట దిగుబడులకు మార్కెట్‌లో లభిస్తున్న ధరలపై రైతుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. మొదట్లో ఉన్న ధరలు చివరికి వచ్చేసరికి తగ్గిపోతున్నారని వివరించారు. కొందరు వ్యాపారులు సిండికేట్ అయి తక్కువ ధర కోడ్ చేస్తున్నారన్న రైతుల ఆరోపణలపై విచారించారు. మార్కెట్‌కు ఈ ఏడాది వచ్చిన దిగుబడులు, లభించిన గరిష్ఠ, కనిష్ఠ ధరలను నమోదు చేసుకున్నారు. అధిక శాతం ప్రభుత్వ మద్దతు ధర మించి వచ్చిందని మార్కెట్ అధికారులు వివరించారు. అనంతరం కమీషన్ ఏజెంట్లు, ఖరీదుదారులతో వారు మాట్లాడారు. క్షేత్రస్థాయిలో రైతులకు లభిస్తున్న ధరలు, ఇతర సమస్యలపై ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఏఓ గోపీనాథ్, మార్కెట్ సూపర్‌వైజర్ విజయ్ చందర్ తదితరులు పాల్గొన్నారు.



బాదేపల్లి యార్డులో విచారిస్తున్న మార్కెటింగ్ జేడీ శ్రీనివాసులు తదితరులు

మెట్టినింటికి చేరుకున్న జములమ్మ



జములమ్మను మెట్టినింటికి తీసుకొస్తున్న పూజారులు



అమ్మవారికి పూజలు చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ సరిత

గద్వాలన్యూటౌన్: భక్తుల కొంగుబంగారంగా విరాజిల్లుతున్న జములమ్మ బుధవారం పుట్టినిల్లు నుంచి మెట్టినింటికి చేరుకున్నారు. జమ్మిచేడు జములమ్మ బ్రహ్మోత్సవాల్లో భాగంగా సంప్రదాయబద్ధంగా నాగపడిగను ఎండ్లబండిలో ఉంచి, విశేష పూజలు నిర్వహించిన అనంతరం అమ్మవారి ఉత్సవమూర్తిని పుట్టినిల్లు అయిన గుర్రంగడ్డ నుంచి జమ్మిచేడు దేవాలయానికి పరుశరామస్వామి ఆలయ పూజారులు తీసుకొచ్చారు. ఈసందర్భంగా మేళతాళాలు, డప్పుల మోతలు, వందలాది మంది భక్తి పారవశ్యం మధ్య ఊరేగింపు కనులపండువగా సాగింది. ఆలయానికి చేరిన జములమ్మకు పూజారులు, ఆలయ పాలకవర్గ సభ్యులు, అధికారులు ఆహ్వానం పలికి, నాగపడిగను ధరింపజేశారు. ఉత్సవాల్లో జెడ్పీ చైర్‌పర్సన్ సరిత పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ పురేందర్‌కుమార్ పాల్గొన్నారు.

దేవరకద్ర మార్కెట్‌కు పోటెత్తిన ఉల్లి



దేవరకద్ర మార్కెట్‌లో ఉల్లి వేలం వేస్తున్న వ్యాపారులు

- క్వింటాల్ ధర గరిష్టంగా రూ.1,650
- కనిష్టంగా రూ.వెయ్యి

దేవరకద్ర: దేవరకద్ర మార్కెట్‌కు బుధవారం ఉల్లి పోటెత్తింది. గత నెల రెండో వారం నుంచి ఉల్లి సీజన్ ప్రారంభమైన తరువాత ప్రతి వారం పెద్ద ఎత్తున ఉల్లి అమ్మకానికి వస్తుంది. బుధవారం వివిధ గ్రామాల నుంచి రైతులు దాదాపు 5,000 బస్తాల ఉల్లి అమ్మకానికి తీసుకొచ్చారు. సీజన్ ప్రారంభం నుంచి ఉల్లి ధరలు దిగి వచ్చాయి. మూడు వారాల నుంచి ఉల్లి ధరలు అటు ఇటుగా నమోదవుతున్నాయి. ఈ వారం కూడా గత వారం వచ్చిన ధరలే నమోదయ్యాయి. స్థానిక వ్యాపారులతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వ్యాపారులు వేలంలో పాల్గొని పెద్దఎత్తున ఉల్లిని కొనుగోలు చేశారు. జిల్లాలో దేవరకద్రలోనే ఉల్లి వ్యాపారం జోరుగా సాగుతుంది. ఈ ప్రాంతంలో ఉల్లిని అధికంగా పండించడంతో ప్రతి వారం ఉల్లి వేలం నిర్వహిస్తున్నారు.

నిలకడగా ధరలు...

బుధవారం జరిగిన వేలంలో నాణ్యమైన ఉల్లి ధర క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ.1,650, రెండో రకం ఉల్లి కనిష్ఠంగా రూ.1,000 గా నమోదయ్యాయి. ఎర్ర ఉల్లి గరిష్ఠంగా రూ.9,00, కనిష్ఠంగా రూ.600 వరకు పలికింది. 45 కిలోల ఉల్లి బస్తా గరిష్ఠంగా రూ.8,00, కనిష్ఠంగా రూ.5,00 వరకు విక్రయించారు. ప్రస్తుతం మార్కెట్‌కు వచ్చిన ఉల్లి నాణ్యంగా ఉండటంతో పాటు బాగా ఆరింది కావడంతో వినియోగదారులు పెద్ద ఎత్తున్న కొనుగోలు చేశారు. మార్కెట్ అంతా చిరు వ్యాపారులు, బయట నుంచి వ్యాపారులతో సందడిగా కనిపించింది. మార్కెట్‌లో లావాదేవీలు జోరుగా కొనసాగాయి. ధాన్యం సీజన్ లేకపోవడంతో వారానికి ఒకసారి జరిగే ఉల్లి వేలంతో వ్యాపారం జోరందుకుంది.

అక్రమ రిజిస్ట్రేషన్లు ఆపాలంటూ రైతుల ఆందోళన

కల్వకుర్తి రూరల్: అక్రమ రిజిస్ట్రేషన్లు ఆపి తమకు న్యాయం చేయాలంటూ బుధవారం మండలంలోని తర్నికల్ గ్రామ రైతులు కల్వకుర్తి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామ జాగీర్దార్లకు సంబంధించిన 300 ఎకరాల భూమిని దశాబ్దాల కాలంగా సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని.. ఇటీవల ఆ భూములను కొందరు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వాటిని రద్దుచేసి యథాస్థితి కొనసాగించాలని కోరారు. అనంతరం తహసీల్దార్ ఇబ్రహీంకు వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో రైతులు కృష్ణారెడ్డి, పాండు, శ్యాం, రామకృష్ణారెడ్డితో పాటు పదుల సంఖ్యలో రైతులు ఉన్నారు. విషయం తెలుసుకున్న బీజేపీ రాష్ట్ర నాయకుడు ఆచారి కార్యాలయం వద్దకు చేరుకొని రైతులకు న్యాయం చేయాలని.. లేదంటే పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

మద్యం మత్తులో వ్యక్తిపై దాడి : కేసు నమోదు

ఉండవెల్లి: పంట పొలాలకు వెళ్లే దారిలో కూర్చొని మద్యం తాగుతున్న వ్యక్తులను వాహనానికి దారి ఇవ్వాలని కోరగా.. మాటా మాటా పెరిగి దాడికి దిగిన ఘటన మండలంలోని పుల్లూరు శివారులో చోటుచేసుకుంది. బుధవారం హెడ్‌కానిస్టేబుల్ తెలిపిన వివరాలిలా.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కర్నూల్ జిల్లా కేంద్రంలోని నర్సింహరెడ్డి కాలనీకి చెందిన ఏడుగురు వ్యక్తులు మద్యం తాగేందుకు పుల్లూరుకు చేరుకున్నారు. శివారులోని పంట పొలాలకు వెళ్లే దారిలో కూర్చొని మద్యం సేవిస్తుండగా అదే దారిలో పంచలింగాలకి చెందిన సుధాకర్, అతని కుమారుడు సునిల్‌కుమార్ ట్రాక్టర్‌పై పంట పొలానికి వెళ్తున్నారు. మట్టి రోడ్డుకు అడ్డుగా కూర్చున్న వారిని పక్కకి జరగాలని అనడంతో మాటామాటా పెరిగి సుధాకర్, సునిల్‌పై వారు రాళ్లతో దాడి చేయడంతో గాయాలయ్యాయి. ఈమేరకు లోకేష్, కిరణ్, రాజు, నవీన్, ధర్మపేట రాజు, తిమోతి, మరో వ్యక్తి కలిసి దాడి చేయించారని సుధాకర్ ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ శ్రీనివాసులు కేసు నమోదు చేశారని, వ్యక్తులు పరారీలో ఉన్నారని, మూడు బైకులను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

అరటిపళ్ల లారీ బోల్తా

జడ్చర్ల: మండలంలోని గొల్లపల్లి గ్రామ శివారులో 44వ నంబర్ జాతీయ రహదారిపై బుధవారం అరటి పండ్ల లారీ బోల్తా పడింది. లలితాంబిక తపోవనం ఆలయం పరిసర ప్రాంతంలో హైద్రాబాద్ వైపు వెళుతున్న అరటి పండ్ల లారీ ప్రమాదవశాత్తు బోల్తా పడడంతో లారీలో ఉన్న అరటి గెలలు రోడ్డుపై కుప్పగా పడ్డాయి. దీంతో జాతీయ రహదారిపై వెళ్తున్న వాహనదారులు అరటి గెలలను ఎత్తుకెళ్లారు. కార్ల డిక్కీలలో, మోటార్‌బైక్‌లపై ఎవరికి వారు గెలలను తీసుకెళ్లారు. ఓ వైపు ప్రమాదం జరిగితే అరటి పండ్ల లూటీ జరగడంతో వారిని నిలవరించే వారు లేకపోవడంతో గెలలు బాటసారుల పాలయ్యాయి.

పోలీసుల అదుపులో మహిళ

గద్వాల క్రైం: అనుమానాస్పదంగా తిరుగుతున్న ఓ మహిళను పట్టుకొని పోలీసులకు అప్పగించిన సంఘటన గద్వాల నదిగ్రహారంలో బుధవారంచోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. బీహార్‌కి చెందిన మహిళ నదిఅగ్రహారం సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతుండగా గమనించిన ప్రజలు ఆమెను ప్రశ్నించారు. ఆమెతో ఉన్న బ్యాగ్‌ను పరిశీలించగా రెండు కత్తులు, చేతి బ్లౌజ్‌లను గుర్తించారు. తప్పించుకునే ప్రయత్నం చేయగా స్థానికులు మహిళను పట్టుకొని పట్టణ పోలీసులకు అప్పగించారు. ఈ ఘటనపై పట్టణ ఎస్‌ఐ శ్రీనివాస్‌ను సంప్రదించగా.. సదరు మహిళ పూర్తి వివరాలు తెలుసుకుని వివరాలు వెల్లడిస్తామని, ప్రస్తుతం రాష్ట్రంలో పిల్లలను అపహరించే ముఠా ఉందనే వార్తల నేపథ్యంలో ప్రజలు కొత్త వారిపై అనుమానం వ్యక్తం చేస్తున్నారని, ఎవరు కూడా ఆందోళన చెందవద్దన్నారు.

ముమ్మాటికీ ఆర్థిక నేరస్తుడే

‘మార్గదర్శి’ పేరిట రామోజీ అక్రమ ఆర్థిక సామ్రాజ్యం ● ఆర్‌బీఐ చట్టానికి విరుద్ధంగా డిపాజిట్ల సేకరణ

- అవి అక్రమ డిపాజిట్లేనని సుప్రీంకోర్టులో ఆర్‌బీఐ వెల్లడి
- 2006 నాటికే రూ.2,600 కోట్ల అక్రమ డిపాజిట్లు
- కేసులు విచారణలో ఉండగా మరో రూ.2 వేల కోట్లు
- ఆ ముసుగులో భారీగా నల్లధనం దందా
- రామోజీ అక్రమాలకు చెక్ పెట్టిన నాటి వైఎస్సార్ ప్రభుత్వం
- అక్రమ డిపాజిట్లు తిరిగి చెల్లించేశామంటూ రాజగురువు బుకాయింపు
- ఎవరి నుంచి సేకరించారు.. ఎవరికి చెల్లించారో మాత్రం చెప్పరట
- నగదు రూపంలో డిపాజిట్ల సేకరణ చట్ట విరుద్ధమన్న ఐటీ శాఖ
- ఆర్‌బీఐ స్టేట్‌మెంట్ నేపథ్యంలో రామోజీకి శిక్షపై సర్వత్రా చర్చ

నల్ల గురివింద
రామోజీ-1

సాక్షి, అమరావతి: మార్గదర్శి చిట్‌ఫండ్స్ కార్యాలయాల్లో గుట్టుచప్పుడు కాకుండా ‘మార్గదర్శి ఫైనాన్సియర్స్’పేరిట ఏళ్ల తరబడి సాగించిన అక్రమ డిపాజిట్ల వసూళ్లు.. నల్లధనం దందాపై 2006లో అప్పటి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం చేపట్టిన చర్యలు ఎట్టకేలకు ఫలించాయి. మార్గదర్శి ఫైనాన్షియర్స్ పేరిట రామోజీరావు అక్రమ డిపాజిట్లు వసూలు చేశారని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) సుప్రీంకోర్టుకు విస్పష్టంగా నివేదించింది. దాంతో రామోజీ అవినీతి ఆట కట్టిందని, ఇక శిక్ష పడటమే మిగిలిందని నిపుణులు ఏకాభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. కనీసం రెండేళ్ల నుంచి గరిష్ఠంగా యావజ్జీవ జైలు శిక్ష పడే అవకాశం ఉందని కూడా చెబుతుండటం ప్రాధాన్యం సంతరించుకుంది. దాంతో మార్గదర్శి ఫైనాన్షియర్స్ పేరిట రామోజీరావు సాగించిన ఆర్థిక అక్రమాల కథ కమామిషు మరోసారి దేశ వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. 2006లో అప్పటి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వం ప్రశ్నించే వరకు ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌లో ‘మార్గదర్శి ఫైనాన్షియర్స్’అనే సంస్థ ఉన్నట్టు కూడా సామాన్యులకు తెలియదు. రాష్ట్రం అంతటా ‘మార్గదర్శి చిట్ ఫండ్స్’కార్యాలయాలే కనిపిస్తూ ఉండేవి. కానీ ఆ కార్యాలయాల్లోనే గుట్టు చప్పుడు కాకుండా ‘మార్గదర్శి ఫైనాన్షియర్స్’పేరిట మరో కంపెనీ ఆర్థిక కార్యకలాపాలు సాగించేదనే విషయం బయటి ప్రపంచానికి తెలీదు. అలా 1997 నుంచి 2006 వరకు మార్గదర్శి ఫైనాన్షియర్స్ యథేచ్ఛగా కార్యకలాపాలు సాగించింది.

> ఈనాడు పత్రికాధిపతి చెరుకూరి రామోజీరావు ఆర్థిక నేరస్తుడే అన్నది నిగ్గు తేలింది. టీడీపీ అధినేత చంద్రబాబు రాజగురువు రామోజీ ఆర్థిక ఉగ్రవాదేనన్నది స్పష్టమైంది. ‘మార్గదర్శి’ ముసుగులో భారీగా నల్లధనం దందా నిర్వహిస్తున్నారన్నదీ రూఢీ అయ్యింది. అక్రమాలను కప్పిపుచ్చుకునేందుకు తొడుక్కున్న ‘పత్రికా స్వేచ్ఛ’ అనే ముసుగు తొలగిపోయింది. చట్టాలను ఉల్లంఘిస్తూ ఆర్థిక అక్రమాలకు పాల్పడ్డ రామోజీ నిజ రూపంలో అవినీతి దిగంబరుడిగా నిలబడ్డాడు.

> మార్గదర్శి ఫైనాన్సియర్స్ అక్రమ డిపాజిట్లు వసూలు చేసిందని ఆర్‌బీఐ స్పష్టం చేయడంతో ఈ కేసులో తరువాత పరిణామాలు ఏమిటన్నది చర్చనీయాంశంగా మారింది. అక్రమ డిపాజిట్ల కేసు నిరూపితమైతే ఏకంగా రెట్టింపు జరిమానా అంటే రూ.5,200 కోట్ల జరిమానాతోపాటు కనీసం రెండేళ్ల నుంచి యావజ్జీవ జైలుశిక్ష విధించే అవకాశాలున్నాయని న్యాయ నిపుణులు చెబుతున్నారు.

భారీగా అక్రమ డిపాజిట్లు సేకరణ

ఆర్‌బీఐ నిబంధనలకు విరుద్ధంగా రామోజీరావు మార్గదర్శి ఫైనాన్షియర్స్ పేరిట భారీగా అక్రమ డిపాజిట్లు సేకరించారు. డిపాజిట్ల సేకరణ పేరిట ప్రజలను మోసం చేయకుండా కట్టడి చేసేందుకు ఆర్‌బీఐ స్పష్టమైన విధివిధానాలను నిర్దేశించింది. ఆర్‌బీఐ చట్టంలోని 45ఎస్ ప్రకారం కంపెనీల చట్టం ప్రకారం నమోదైన ఇన్‌కార్పొరేటెడ్ కంపెనీలు మాత్రమే ప్రజల నుంచి డిపాజిట్లు సేకరించాలి. రామోజీరావు తన గ్రూపు సంస్థలను ‘హిందూ అవిభాజ్య కుటుంబం(హెచ్‌యూఎఫ్) కింద నమోదు చేసినట్టుగా పేర్కొన్నారు. హెచ్‌యూఎఫ్ కింద నమోదైన కంపెనీలు ప్రజల నుంచి డిపాజిట్లు వసూలు చేయకూడదు. కానీ చట్టానికి తాను అతీతం అని భావించే రామోజీ ఈ నిబంధనను నిర్భీతిగా బేఖాతరు చేశారు. మార్గదర్శి ఫైనాన్సియర్స్ పేరిట యథేచ్ఛగా డిపాజిట్లు వసూలు చేశారు. 2006లో మార్గదర్శి ఫైనాన్షియర్స్ అక్రమ డిపాజిట్ల వ్యవహారం వెలుగులోకి వచ్చే నాటికి ఏకంగా రూ.2,600 కోట్ల అక్రమ డిపాజిట్లను సేకరించడం విభ్రాంతికర వాస్తవం. కాగా మార్గదర్శి ఫైనాన్షియర్స్‌పై కేసు న్యాయస్థానంలో విచారణలో ఉండగా మరో రూ.2 వేల కోట్ల వరకు అక్రమ డిపాజిట్లు సేకరించారని రాష్ట్ర ప్రభుత్వ న్యాయవాది నిరంజన్ రెడ్డి సుప్రీంకోర్టుకు నివేదించడం ప్రాధాన్యం సంతరించుకుంది.



తప్పు ఒప్పుకోక తప్పని రామోజీ

మార్గదర్శి ఫైనాన్షియర్స్ అక్రమ డిపాజిట్ల దందా బయటపడటంతో రామోజీరావు కంగుతిన్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వం మార్గదర్శి ఫైనాన్షియర్స్ అక్రమాలపై దర్యాప్తు చేసేందుకు అప్పటి ప్రభుత్వ సలహాదారు రంగాచారిని విచారణ అధికారిగా నియమించింది. ఈ అక్రమాలపై సీఐడీ తరపున న్యాయ స్థానాల్లో కేసులు దాఖలు చేసేందుకు టి.కృష్ణంరాజును అధీకృత అధికారిగా నియమించింది. మార్గదర్శి ఫైనాన్షియర్స్ పేరిట ఏకంగా రూ.2,600 కోట్ల అక్రమ డిపాజిట్లు సేకరించినట్టు వీరు గుర్తించారు. కాగా తాము చట్టాన్ని ఉల్లంఘించలేదని బుకాయించేందుకు రామోజీ యత్నించారు. హెచ్‌యూఎఫ్‌గా తాము ప్రజల నుంచి డిపాజిట్లు సేకరించవచ్చని అడ్డగోలుగా వాదించారు. కానీ సెక్షన్ 45 ఎస్ ప్రకారం హెచ్‌యూఎఫ్‌లు డిపాజిట్లు సేకరించకూడదని ఆర్‌బీఐ స్పష్టం చేసింది. దాంతో తాము తప్పు చేసినట్టు రామోజీరావు అంగీకరించారు. నగదు రూపంలో డిపాజిట్లు వసూలు చేసినట్టు కూడా సమ్మతించారు. తమ తప్పును అంగీకరిస్తూ డిపాజిట్‌దారులకు వారి డిపాజిట్లను తిరిగి చెల్లించేస్తామని, మార్గదర్శి ఫైనాన్షియర్స్‌ను మూసి వేస్తామని న్యాయస్థానానికి లిఖిత పూర్వకంగా తెలిపారు.

వివరాలు చెప్పం అని వితండవాదం

తాము అక్రమంగా వసూలు చేసిన డిపాజిట్లను సంబంధిత డిపాజిట్‌దారులకు తిరిగి చెల్లించేశామని రామోజీరావు న్యాయస్థానానికి తెలిపారు. కాగా అక్రమ డిపాజిట్లు ఎవరెవరి నుంచి సేకరించారు.. ఎవరెవరికి తిరిగి చెల్లించారో ఆ వివరాలు వెల్లడించాలని సీఐడీ, ఉండవల్లి అరుణ్‌కుమార్ కోరినప్పటికీ రామోజీరావు సమ్మతించ లేదు. ఆ వివరాలు తాము వెల్లడించాల్సిన అవసరం లేదని వితండ వాదం చేశారు. కాగా అక్రమంగా డిపాజిట్లు వసూలు చేసిన రామోజీరావును ప్రాసిక్యూట్ చేయాలని అధీకృత అధికారి కృష్ణంరాజు దాఖలు చేసిన పిటిషన్‌ను ఉమ్మడి హైకోర్టు తన చివరి పని దినాన కొట్టివేయడాన్ని సవాల్ చేస్తూ.. డిపాజిట్దారుల వివరాలు వెల్లడించాలని కోరుతూ ఉండవల్లి అరుణ్‌కుమార్ సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌లో ఏపీ ప్రభుత్వం 2022లో ఇంప్లీడ్ అయ్యింది. డిపాజిట్‌దారుల వివరాలు వెల్లడించాల్సిందేనని సుప్రీంకోర్టు గత ఏడాది పేర్కొంది. కానీ ఇంత వరకు రామోజీరావు తమ డిపాజిట్‌దారుల వివరాలను వెల్లడించకపోవడం గమనార్హం.

నల్లధనం దందా వల్లే గప్‌చుప్

- మార్గదర్శి చిట్‌ఫండ్స్ కార్యాలయాల్లో గుట్టుచప్పుడు కాకుండా నిర్వహించిన ‘మార్గదర్శి ఫైనాన్షియర్స్’ముసుగులో రామోజీరావు భారీగా నల్లధనం దందాను సాగించారు.
- 2006 నాటికే ఏకంగా 32,385 మంది నుంచి రూ.2,600 కోట్ల వరకు అక్రమంగా డిపాజిట్లు సేకరించారని వెల్లడైంది. కానీ వారి పేర్లు, వివరాలను మాత్రం వెల్లడించేందుకు రామోజీరావు ససేమిరా అంటుండటం గమనార్హం. ఎందుకంటే ఆ డిపాజిట్ల ముసుగులో టీడీపీ పెద్దలు భారీగా నల్ల ధనాన్ని చలామణిలోకి తీసుకువచ్చారు. అందుకే సీఐడీతోపాటు న్యాయస్థానం కోరినప్పటికీ వారి వివరాలను వెల్లడించేందుకు సమ్మతించడం లేదు.
- మార్గదర్శి ఫైనాన్షియర్స్ రశీదు రూపంలో సేకరించిన డిపాజిట్ల పత్రాలను పరిశీలిస్తే అదంతా నల్లధనం బాగోతమేనన్నది స్పష్టమవుతోంది. డిపాజిట్‌దారుల పాన్ నంబర్లు, చిరునామాలు కూడా లేకుండానే డిపాజిట్లు సేకరించడం గమనార్హం.
- మార్గదర్శి ఫైనాన్షియర్స్ డిపాజిట్‌దారులకు చెల్లించాల్సిన మొత్తం రూ.2,610.38 కోట్లుగా రామోజీరావు 2006లో తమ అఫిడవిట్‌లో పేర్కొన్నారు. కానీ 2008లో సమర్పించిన అఫిడవిట్‌లో రూ.1,864.10 కోట్లు చెల్లించేశామని తెలిపారు. మరి మిగిలిన రూ.800 కోట్ల డిపాజిట్లు ఏమయ్యాయనే విషయంపై మౌనం వహించారు. గుట్టు చప్పుడు కాకుండా రికార్డుల నుంచి తొలగించిన ఆ రూ.800 కోట్లు రామోజీకి అత్యంత సన్నిహితుడైన పచ్చ బాబు, ఆయన గ్యాంగ్‌వే అని తెలుస్తోంది. పోనీ చెల్లించామని చెబుతున్న రూ.1,864.10 కోట్ల డిపాజిట్లు ఎవరెవరికి చెల్లించారో చెప్పడానికి రామోజీ ససేమిరా అంటున్నారు.

బాబుకు రెస్ట్!

35 ఏళ్లుగా పోటీ చేస్తున్నారు... రెస్ట్ అవసరమన్న భార్య

ఈ సారి కుప్పంలో పోటీ చేయాలనుకుంటున్నానన్న భువనేశ్వరి

ఈ మాటల వెనక కథ.. స్క్రీన్‌ప్లే.. దర్శకత్వం చంద్రబాబుదే

‘సిద్ధం’ సభలకు వెల్లువలా వస్తున్న జనాన్ని చూసి వెన్నులో వణుకు

(సాక్షి, అమరావతి-తిరుపతి-శాంతిపురం)



“35 ఏళ్లుగా మీరు చంద్రబాబు నాయుడు గారిని గెలిపిస్తున్నారు. ఇక ఆయనకు రెస్ట్ ఇవ్వాలనిపిస్తోంది. అందుకే ఈ సారి ఇక్కడి నుంచి నేను పోటీ చేయాలనుకుంటున్నాను” అంటూ చంద్రబాబు నాయుడి భార్య నారా భువనేశ్వరి బుధవారం కుప్పంలో ఓ బహిరంగ సభలో స్పష్టంగా చెప్పారు.

స్కిల్ కుంభకోణంలో వేల కోట్లు నేరుగా విత్‌డ్రా చేసుకుని మింగేసిన కేసులో ఈ మధ్య చంద్రబాబు నాయుడిని పోలీసులు అరెస్టు చేయటంతో ఆయన జైలుకు వెళ్లటం తెలిసిందే. అది జరిగిన 10-15 రోజుల తరవాత కూడా ఆయన జైలు జీవితాన్ని చూసి తట్టుకోలేక కొందరు మరణించారన్నది టీడీపీ-ఎల్లో మీడియా వ్యాఖ్యానం. వారందరికీ సాయం చెయ్యడానికి నేరుగా నారా భువనేశ్వరి ఓ యాత్ర చేస్తున్నారు. ఆమేమీ రాజకీయ నాయకురాలు కాదు. దీంతో యాత్రలో భాగంగా ఎక్కడికి వెళ్లాలి? ఎవరెవరిని కలవాలి? ఎవరికి చెక్కులివ్వాలి? ఏమేం మాట్లాడాలి? అనేది మొత్తం స్క్రిప్టు ప్రకారమే చేస్తున్నారు. బుధవారం మాట్లాడిన మాటలు కూడా ఆ స్క్రిప్టులో భాగమే. కళ్లెదుట ఓటమి స్పష్టంగా కనిపిస్తుండడంతో ఏదో ఒక వంకతో అక్కడి నుంచి పోటీ చేయకుండా జారుకోవాలనేది బాబు పన్నాగమని, అందుకే భార్యతో ఆ మాటలు మాట్లాడించారు తప్ప అవేమీ చమత్కారమో, యథాలాపమో కావని టీడీపీ వర్గాలే చెబుతున్నాయి.

కుప్పంలో పడిపోయిన బాబు గ్రాఫ్...

కుప్పం బరి నుంచి పక్కకు తప్పుకొని వేరే నియోజకవర్గం చూసుకోవాలని, లేకపోతే ఈ సారి ఎన్నికల్లో పోటీయే చేయకుండా నాన్ ప్లేయింగ్ కెప్టెన్‌గా వ్యవహరించాలని బాబు ఆలోచిస్తున్నట్లు టీడీపీ వర్గాలు చెబుతున్నాయి. కుప్పంలో బాబు గ్రాఫ్ అంతకంతకూ దారుణంగా పడిపోవటం దీనికి మొదటి కారణం. నిజానికి 2019 ఎన్నికల్లోనే ఆయన మెజారిటీ బాగా తగ్గిపోవటం నుంచి ఈ గ్రాఫ్ పతనం మొదలయింది. ఆ తర్వాత జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో చంద్రబాబు చేతి నుంచి కుప్పం జారిపోయింది. మున్సిపల్ ఎన్నికల్లో కుప్పం మున్సిపాలిటీని వైఎస్సార్‌సీపీ చేజిక్కించుకుంది. 25 వార్డుల్లో టీడీపీ కేవలం 7 వార్డుల్లో గెలవగా మిగిలిన 18 వార్డుల్లోనూ వైఎస్సార్ సీపీ అభ్యర్థులు జయకేతనం ఎగురవేశారు. అంతకుముందు జరిగిన పంచాయతీ ఎన్నికల్లో 89 పంచాయతీలకు గాను 70 పంచాయతీలను వైఎస్సార్‌సీపీ గెలుచుకుంది. నాలుగు జెడ్పీటీసీలు, నాలుగు ఎంపీపీ స్థానాల్లో కూడా టీడీపీ ఓడిపోయింది. ఈ ఫలితాలన్నీ కుప్పంలో చంద్రబాబు పని అయిపోయినట్లేనని స్పష్టంగా చెప్పాయి.

‘సిద్ధం’ సభలతో ఉక్కిరి బిక్కిరి

చంద్రబాబు ప్రతి పార్లమెంటు నియోజకవర్గంలోనూ ‘రా... కదలిరా’ పేరిట సభలు నిర్వహించారు. మరోవైపు లోకేశ్ ‘శంఖారావం’ పేరుతో సభలు పెట్టారు. ఇక నారా భువనేశ్వరి ‘నిజం గెలవాలి’ అంటూ సమావేశాలు పెడుతున్నారు. వైఎస్సార్ సీపీ తరఫున వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఒక్కరే... ‘సిద్ధం’ అంటూ సభలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే మూడు ప్రాంతాల్లో సభలు నిర్వహించారు. బాబు...లోకేశ్... భువనేశ్వరి సభలన్నిట్లోనూ కలిపినా... రాప్తాడులో జరిగిన సిద్ధం సభకు వచ్చిన జనాల్లో సగం కూడా రాలేదు. ‘సిద్ధం’ సభలు మూడూ ఒకదాన్ని మించి మరొకటి జనసంద్రాలయ్యాయి. జనం నాడి అర్థమైన చంద్రబాబుకు వణుకు మొదలైంది. అందుకే పొత్తులతోనైనా ఎలాగోలా పరువు నిలబెట్టుకోవాలని ప్రయత్నిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కుప్పంలో కూడా తాను ఓడిపోతే పరిస్థితి దయనీయంగా మారుతుందని, పార్టీ చేజారిపోతుందని అర్థమై.. ఈ సారికి వేరే చోట నుంచి పోటీ చెయ్యడమో... లేకపోతే ఎక్కడా పోటీ చేయకుండా నాన్ ప్లేయింగ్ కెప్టెన్‌లా వ్యవహరించి పరువు నిలుపుకోవటమో చేయాలని చూస్తున్నారన్నది పార్టీ వర్గాల మాట.

కమనీయం సీతారాముల కల్యాణం



చారకొండ: రెండో భద్రాద్రిగా పేరొందిన సిర్సనగండ్ల సీతారామచంద్రస్వామి ఆలయంలో పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకొని బుధవారం సీతారాముల కల్యాణం నిర్వహించారు. అర్చకుల వేదమంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల నడుమ క్రతువు కొనసాగింది. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ధేరం రామశర్మ, ఈవో రఘు, అర్చకులు లక్ష్మణశర్మ, మురళీధర్ శర్మ, అనంతరామశర్మ పాల్గొన్నారు.

బీచుపల్లి పుణ్యక్షేత్రంలో..



ఎర్రవల్లిచౌరస్తా: శ్రీరాముడి జన్మనక్షత్రమైన పునర్వసును పురస్కరించుకొని బుధవారం బీచుపల్లి కోదండరామస్వామి ఆలయంలో సీతారాముల కల్యాణ వేడుకను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు భువనచంద్ర, దత్తుస్వామి సీతారాముల ఉత్సవ విగ్రహాలను అందంగా ముస్తాబుచేసి వేదమంత్రోచ్చారణల నడుమ కల్యాణం జరిపించారు. కార్యక్రమాన్ని తిలకించేందుకు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. వచ్చిన భక్తులకు ఆలయ పాలకమండలి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం చేపట్టినట్లు మేనేజర్ సురేందర్‌రాజు వివరించారు.

రామన్‌పాడులో 1,017 అడుగుల నీటి మట్టం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో నీటి మట్టం తగ్గుతోంది. బుధవారం 1,017 అడుగులకు చేరింది. జూరాల ఎడమ కాల్వ సమాంతర కాల్వ ద్వారా వచ్చె నీటిని నిలిపివేశారు. తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కులు నీటిని వినియోగిస్తున్నామని ఏఈ సింగిరెడ్డి రనీల్‌రెడ్డి తెలియజేశారు.

గల్లీ టు రంజీ

హమాలీ కుమారుడి క్రికెట్ ప్రయాణం

- హెచ్‌సీఏ రంజీ జట్టులో గడుగు గణేష్
- టోర్నీల్లో సత్తాచాటుతున్న ఉమ్మడి పాలమూరు క్రీడాకారుడు
- టూడేస్‌లో ట్రిపుల్ సెంచరీలు
- మహబూబ్‌నగర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ అభినందనలు

చిన్నతనం నుంచి క్రికెట్ అంటే ప్రాణం అతనికి. గల్లీలో క్రికెట్ ఆడుతూ.. వీలు దొరికినప్పుడల్లా ఆటకు మెరుగులు అద్దుకుంటూ వచ్చాడు. ఎన్నటికైనా క్రికెట్‌లో ఉన్నతంగా రాణించాలనే కసి.. పట్టుదలతో ముందడుగు వేస్తున్న కుమారుడిని.. హమాలీ పని చేస్తున్న తండ్రి వెన్నంటి ఉంటూ ప్రోత్సహించాడు. అంచెలంచెలుగా రాణిస్తూ.. ఎట్టకేలకు 25 ఏళ్ల ఉమ్మడి జిల్లా ప్రజల నిరీక్షణకు తెర దించుతూ హెచ్‌సీఏ రంజీ జట్టులో స్థానం సంపాదించుకున్నాడు పాలమూరు క్రీడాకారుడు గడుగు రమేష్.



(హెచ్‌సీఏ) ఎ-2 డివిజన్ టూడేస్ మ్యాచ్‌లో ట్రిపుల్ సెంచరీ చేసిన గణేష్‌ను అభినందిస్తున్న తోటి క్రీడాకారులు, చిత్రంలో ఎండీసీఏ కార్యదర్శి రాజశేఖర్ (ఫైల్)

మహబూబ్‌నగర్ క్రీడలు: ఉమ్మడి జిల్లాలోని మరికల్ మండలం వెంకటాపూర్‌కు చెందిన గడుగు రమేష్, సుధ దంపతుల కుమారుడు గడుగు గణేష్ జిల్లా క్రికెట్‌లో సంచలన క్రికెటర్‌గా గుర్తింపు తెచ్చుకున్నాడు. తండ్రి రమేష్ మహబూబ్‌నగర్‌లోని క్లాక్ టవర్‌లో హమాలీ పనిచేస్తూ గణేష్‌ను క్రికెట్‌లో ప్రోత్సహించేవాడు. చిన్ననాటి నుంచే గణేష్ క్రికెట్‌లో ప్రతిభ కనబరుస్తూ వచ్చాడు. 2013లో జిల్లా క్రికెట్‌లో అడుగుపెట్టిన గణేష్ రెండేళ్లలోనే మెరుగైన క్రీడాకారుడిగా ఎదిగాడు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రికెట్ పోటీల్లో పలుసార్లు రాష్ట్రస్థాయి టోర్నీల్లో జిల్లా జట్టుకు ప్రాతినిథ్యం వహించాడు. రాష్ట్రస్థాయి అండర్-14, 17, 19 రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రికెట్ పోటీల్లో పాల్గొని ప్రతిభచాటాడు. పలుసార్లు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జాతీయస్థాయి క్రికెట్ టోర్నీల్లో గణేష్ రాష్ట్ర జట్టుకు ప్రాతినిథ్యం వహించాడు. 2015లో మహారాష్ట్రలో జరిగిన అండర్-17 ఎస్‌జీఎఫ్, 2016లో, 2017 సంవత్సరాల్లో మధ్యప్రదేశ్ రాష్ట్రంలో జరిగిన అండర్-19 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జాతీయక్రికెట్ టోర్నీలో పాల్గొన్నాడు. 2018లో మహబూబ్‌నగర్‌లో జరిగిన అండర్-19 నేషనల్ సూపర్ సెవన్ క్రికెట్ చాంపియన్‌షిప్‌లో గణేష్ అద్భుతమైన ఆట ప్రదర్శించాడు. ఈ టోర్నీలో 209 పరుగులు చేయడంతోపాటు వరుసగా మ్యాచుల్లో ఐదు వికెట్లు తీసి బెస్ట్ ఆల్ రౌండర్‌గా ఎంపికయ్యాడు. మహబూబ్‌నగర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రీమియర్ లీగ్ (ఎంపీఎల్) టోర్నీల్లో గణేష్ ఆల్‌రౌండర్‌గా మెరుగైన ప్రతిభ కనబరుస్తున్నాడు. 2019లో జరిగిన ఎంపీఎల్-5లో జేఆర్ వారియర్స్‌కు జట్టుకు ప్రాతినిధ్యం వహించి బ్యాటింగ్, బౌలింగ్‌లో రాణించాడు. గణేష్ 144 180 పరుగులు, 7 వికెట్లు తీసి మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌గా నిలిచి మోటార్ బైక్‌ను అందుకున్నాడు.

హెచ్‌సీఏ రంజీ జట్టులో చోటు..

క్రికెటే సర్వస్వంగా భావించి నిరంతరం కష్టపడుతున్న గణేష్ ఎట్టకేలకు హెచ్‌సీఏ రంజీ జట్టులో చోటు దక్కించుకున్నాడు. డిసెంబర్ చివరి వారంలో రంజీ జట్టులో స్టాండ్‌బైగా ఎంపికైన గణేష్ చివరకు 15మందితో కూడిన జట్టులో స్థానాన్ని సంపాదించుకున్నాడు. గణేష్ రంజీ జట్టుకు ఎంపిక కావడంపై మహబూబ్‌నగర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో ఏళ్ల నుంచి జిల్లా క్రీడాకారుడు రంజీజట్టులో చోటు దక్కించుకోవాలన్న మా కల నెరవేరిందని, గణేష్‌ను స్ఫూర్తిగా తీసుకొని మరింత మంది క్రీడాకారులు క్రికెట్‌లో నైపుణ్యం ప్రదర్శించాలని కోరారు. గణేష్‌ను ఎండీసీఏ ప్రధాన కార్యదర్శి ఎం.రాజశేఖర్, ఉపాధ్యక్షులు వెంకటరామారావు, సురేష్‌కుమార్, ఉదేశ్, లక్ష్మీకాంత్, చంద్రకుమార్‌గౌడ్, క్రిష్ణమూర్తి, కోచ్‌లు గోపాలకృష్ణ, అబ్దుల్లా, మన్నాన్ తదితరులు అభినందించారు.

భారత జట్టుకు ఎంపిక కావడమే లక్ష్యం



చిన్నప్పటి నుంచి క్రికెట్ అంటే ఇష్టం. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం ప్రాక్టీస్ చేస్తుంటాను. ఎండీసీఏ అసోసియేషన్ ఎంతగానో ప్రోత్సహిస్తున్నారు. రంజీ జట్టులో చోటు దక్కించుకోవడం సంతోషంగా ఉంది. భవిష్యత్తులో భారత జట్టుకు జట్టుకు ఎంపిక రావడమే లక్ష్యం. ఇందుకు నిరంతరం శ్రమిస్తాను.

– గణేష్, యువ క్రికెటర్

హెచ్‌సీఏ టోర్నీల్లో సత్తా

గణేష్ ఎండీసీఏ, హెచ్‌సీఏ క్రికెట్ అసోసియేషన్ టోర్నీల్లో సత్తా చాటుతున్నాడు. హెచ్‌సీఏ అండర్-16, 19, 23 జట్లకు పలుసార్లు జిల్లా నుంచి ప్రాతినిథ్యం వహించాడు. హెచ్‌సీఏ కంబైన్ జిల్లా జట్టుకు ఎంపికై రాణించాడు. 2019-20లో హైదరాబాద్‌లో జరుగుతున్న హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఎ-2 డివిజన్ లీగ్ మ్యాచ్‌లో గణేష్ అద్భుతమైన బ్యాటింగ్‌తో తన అత్యధిక వ్యక్తిగత స్కోర్ నమోదు చేశాడు. రాజు క్రికెట్ క్లబ్ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో గణేష్ ట్రిపుల్ సెంచరీ చేసి సీజన్‌లో మొట్టమొదటిది నమోదు చేశాడు. మ్యాచ్‌లో 200 బంతుల్లో 42 ఫోర్లు, 7 సిక్స్‌లతో 318 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. ఇదే సీజన్‌లో మరో ట్రిపుల్ సెంచరీ (329 పరుగులు) చేశాడు. రెండు నెలల క్రితం జింఖానా మైదానంలో జరిగిన సీనియర్ జోనల్ క్రికెట్ టోర్నీలో కంబైన్డ్ జట్టు తరపున రెండు మ్యాచుల్లో కలిపి 350 పరుగులు చేశాడు. గణేష్ ఇప్పటివరకు 25కిపై త్రిడేస్‌లో ఆరు సెంచరీలు చేయగా 8 టూడేస్ మ్యాచ్‌లు ఆడాడు.

ఉత్సవాలకు వేళాయె..

నేటి నుంచి జడ్చర్ల వేంకటేశ్వరస్వామి బ్రహోత్సవాలు

- సుప్రభాతసేవతో ప్రారంభం..
- శుక్రవారం కల్యాణం.. శనివారం రాత్రి రథోత్సవం
- ఏర్పాట్లు పూర్తిచేసిన నిర్వాహకులు



స్వామివారి మూల విగ్రహం



జడ్చర్లలోని వేంకటేశ్వరస్వామి ఆలయం

జడ్చర్ల టౌన్: పట్టణంలోని పురాతన లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఏటా మాఘశుద్ధ త్రయోదశి రోజున ఉత్సవాలు ప్రారంభమవుతాయి. సాధారణంగా మండలంలోని గంగాపూర్ లక్ష్మీచెన్నకేశవస్వామి ఉత్సవాలు ముగిసిన నాలుగు రోజుల తరువాత ఆలయ బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. గురువారం సుప్రభాతసేవ, పంచామృత అభిషేకం, గణపతిపూజ, పుణ్యాహవాచనం, కంకణపూజ, అంకురార్పణం, గోపూజ, ప్రదోష పూజలతో ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి.

రేపు కల్యాణం..

ఉత్సవాల రెండోరోజు శుక్రవారం ధ్వజారోహణం, స్వామి, అమ్మవార్ల కల్యాణం వైభవంగా నిర్వహించనున్నారు. కల్యాణ వేడుకలో శాలిబండ రాఘవేంద్ర భజనమండలి, పాలమూరు రాఘవేంద్ర సేవా సమితి వారి భజనలు, కోలాటాలు, నృత్య ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలువనున్నాయి. కల్యాణ వేడుకను తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలిరానుండటంతో ఎ లాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. అదేరోజు రాత్రి పుష్పర థం నిర్వహిస్తారు. మూడోరోజు శనివారం శ్రీమద్భగవద్గీత, విష్ణుసహస్రనామ పారాయణం, రాత్రి 9 గంటలకు మారుతి భజనమండలి, వేంకటేశ్వర భక్తమండలితో చిరుతల భజన, 11 గంటలకు రథోత్సవం ఉంటుంది. నాలుగోరోజు ఆదివారం శకటోత్సవం.. తర్వాతి రోజుల్లో వరుసగా గరుడ, గజ, శేషవాహన సేవలు మార్చి 1వ తేదీ వరకు కొనసాగుతాయి. చక్రతీర్థంతో ఉత్సవాలు ముగించనున్నారు.

సర్వం సిద్ధం..

శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల నిర్వహణకు అన్ని ఏర్పాటు పూర్తి చేశాం. కల్యాణానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు తీసుకున్నాం. రథోత్సవం, శకటోత్సవానికి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నాం. భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలి.

– కొత్త మధు, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుడు, జడ్చర్ల

50 ఏళ్లుగా నిర్వహిస్తున్నాం..

ఏటా మాఘమాసంలో లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఉత్సవాలు 50 ఏళ్లుగా నిర్వహిస్తున్నాం. పూర్వీకు ల నుంచి వచ్చిన ఆచారాన్ని కొనసాగిస్తున్నాం. ఉత్సవాల నిర్వహణకు ఇప్పటికే ప్రభుత్వ శాఖల కు సమాచారం అందించి ఏర్పాట్లు పూర్తిచేశాం.

– నరహరి భీంసేనాచార్య, వంశపారంపర్య ధర్మకర్త

సమ్మక్క-సారలమ్మకు నల్లమల ఆదివాసీల సారె

మన్ననూర్: సమ్మక్క - సారలమ్మలకు నల్లమల ప్రాంత ఆదివాసీల తరపున సారె అందించనున్నట్లు ఐటీడీఏ ఇన్‌చార్జి పీఓ, డీఎఫ్ఓ రోహిత్‌రెడ్డి చెప్పారు. బుధవారం మన్ననూర్‌లోని ఐటీడీఏ కార్యాలయ ఆవరణలో ఆదివాసీ నాయకులు, ఐటీడీఏ అనుబంధ ఉద్యోగులతో ఆయన వేర్వేరుగా సమావేశమై మాట్లాడారు. ప్రతి ఏడాది మాదిరిగానే మన్ననూర్ ఐటీడీఏ తరపున నల్లమల నుంచి సమ్మక్క - సారలమ్మలకు సారె తీసుకెళ్లనున్నట్లు తెలిపారు.

- గతంలో మాదిరిగానే వారంలో ఒక రోజు (గురువారం) గ్రీవెన్స్‌డే నిర్వహించనున్నట్లు ఐటీడీఏ ఇన్‌చార్జి పీఓ, డీఎఫ్ఓ రోహిత్‌రెడ్డి తెలిపారు. అందుకు సంబంధించిన కార్యాచరణ రూపొందించాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వం చెంచుల అభ్యున్నతికి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో పాటు జన్‌మన్ కార్యక్రమాన్ని పూర్తి స్థాయిలో అమలు చేయాలన్నారు. ముఖ్యంగా చెంచు గ్రామాలు, గూడాలు, పెంటలలో విద్యుత్ సౌకర్యం కల్పించడంతో పాటు నీటి ఎద్దడి లేకుండా చూడాలన్నారు. డీటీడీఓ కమలేశ్వర్‌రెడ్డి, ఏఓ జాఫర్ హుస్సేన్, శంకర్, లక్ష్మయ్య, నాసర్, తిరుపతయ్య, కల్యాణ్, ఎంపీటీసీ శ్రీనివాసులు, శ్రీనివాసులు, పెద్దిరాజు, పెద్దులయ్య ఉన్నారు.



మాట్లాడుతున్న ఇన్‌చార్జి పీఓ రోహిత్‌రెడ్డి